క్లుప్తంగా

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై బీజేపీ జెండా



నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పాయల్ శంకర్ గెలుపొందడంతో ఆదివారం బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై బీజేపీ జెండా ఎగరవేసి, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీఆర్ఎస్ జెండా స్థానంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై బీజేపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీకి పెరిగిన ఓట్లు

ఇచ్చోడ: బోథ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో గతంలో కంటే బీఆర్ఎస్, బీజేపీలకు ఈసారి ఓట్లు పెరగగా.. కాంగ్రెస్ పార్టీకి భారీగా ఓట్లు తగ్గాయి. 2018 ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి రాథోడ్ బాపూరావుకు 60,967 ఓట్లు రాగా.. 2023 ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌కు 76,297 పోలయ్యాయి. గతంలో కంటే ఈసారి బీఆర్ఎస్‌కు 15,330 ఓట్లు పెరిగాయి. 2018 ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి మడావి రాజుకు 4,823 ఓట్లు రాగా, 2023 ఎన్నికలలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావుకు 53,274 ఓట్లు వచ్చాయి. గతంలో కంటే ఈసారి 48,451 ఓట్లు అధికంగా వచ్చాయి. 2018 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సోయం బాపూరావుకు 54,328 ఓట్లు రాగా, 2023 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆడే గజేందర్‌కు 32,426 ఓట్లు రాగా 21,902 ఓట్లు తగ్గాయి.

సీపీఐ నాయకుల సంబురాలు



నృత్యం చేస్తున్న సీపీఐ నాయకులు

ఎదులాపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటాన్ని, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపొందడాన్ని హర్షిస్తూ జిల్లా సీపీఐ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకురాలు ముడుపు నళినీరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి నృత్యం చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఇందులో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీ గజ్జలమ్మదేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. గురుస్వామి జక్కని గజేందర్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, అర్చన, పల్లకి సేవ చేశారు. మహారాష్ట్రలోని నాందేడ్, బోకర్, ధర్మాబాద్, శివుని, ఇస్లాపూర్, అప్పారావుపేట్ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. తులాభారంతోపాటు చిన్నారుల తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

భైంసాలో భారీగా బందోబస్తు



నిర్మల్ చౌరస్తాలో భారీగా మోహరించిన పోలీసులు

భైంసాటౌన్: పట్టణంలో ఆదివారం భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆదేశాల మేరకు ప్రధాన కూడళ్లతోపాటు సున్నిత ప్రాంతాలు, అభ్యర్థుల నివాస ప్రాంతాల వద్ద బందోబస్తు నిర్వహించారు. ముధోల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. బీఎస్ఎఫ్ బలగాలతోపాటు స్థానిక పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



ఇంద్రవెల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మెజార్టీ సీట్లు గెలుపొందడంతో టపాసులు పేల్చారు. భీంపూర్ మండలంలోని అంతర్గాం స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ వెంకట్ రెడ్డి, నరేశ్‌యాదవ్, గంగారెడ్డి, రామన్న, రాకేశ్, గంభీర్‌యాదవ్ పాల్గొన్నారు.

బోథ్: కాంగ్రెస్ అధిక సీట్లు సాధించి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా నాయకులు ఆదివారం బస్టాండ్ వద్ద సంబురాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కాంగ్రెస్ ద్వారానే మంచి పాలన వస్తుందన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సల్ల రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్, నాసర్ అహ్మద్, రాజశేఖర్, గంగారాం, భోజన్న, నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

నేరడిగొండ: కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారం చేపడుతుండడంతో నేరడిగొండ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. నాయకులు జాదవ్ వసంత్ నాయక్, అనుపట్ల సంజీవ్ కుమార్, బత్తుల నర్సింగ్‌లు మిఠాయిలు పంచిపెట్టారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడంతో ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ నాయకులు, ఆదివాసీలు సంబురాలు జరుపుకున్నారు. సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ.. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గోండ్‌గూడ ర్యాలీ నిర్వహించి, టపాసులు కాల్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెస్రం నాగ్‌నాథ్, పరత్‌వాగ్ విశాల్, మెస్రం వెంకట్‌రావ్, మడావి ఇంద్రు, చహకటి నాగోరావ్, మెస్రం ఆనంద్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.



సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



సిరికొండలో..

సిరికొండ: ఖానాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ భొజ్జు పటేల్ గెలుపొందడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. డప్పుచప్పుళ్ల మధ్య మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ నియోజకవర్గంలో రసవత్తరంగా సాగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ భొజ్జు పటేల్ గెలుపొందడంతో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో నాయకులు టపాసులు కాల్చారు. అనంతరం బైక్ ర్యాలీలు నిర్వహించారు. నాయకులు పట్టణ కేంద్రంలోని కుమురం భీం విగ్రహం, ఎక్స్‌రోడ్డులోని తుకారం విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

గుడిహత్నూర్: మండలంలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రావాలని ప్రజలు ఆశీర్వదించారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంకతి రవీందర్ అన్నారు. కాంగ్రెస్‌ను ఆదరించిన ప్రజలకు అభినందనలు తెలుపుతూ స్థానిక బస్టాండ్ ఆవరణలో టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకులు తొడసం దౌలత్‌రావ్, నాగ్‌నాథ్ అప్పా, చట్ల మహేందర్, జల్లు, విష్ణు పోలే, నరేశ్ పాల్గొన్నారు.



గుడిహత్నూర్‌లో..



తాంసి: అంతర్గాంలో..



బోథ్: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

టీవీలకే ప్రజలు పరిమితం



వడ్డాడిలో..



తాంసిలో ఎన్నికల ఫలితాలను వీక్షిస్తున్న నాయకులు

- ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్న ప్రజలు

తాంసి: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు టీవీలకు, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయారు. ఎక్కడ ఎవరికీ అనుకూలంగా ఓట్లు పడ్డాయి అనుకుంటూ చర్చించుకున్నారు. గ్రామాల్లో యువత సైతం ఎన్నికలల్లో ఎవరూ విజయం సాధిస్తారని ఫోన్ల ద్వారా ఎప్పటికప్పుడు ఫలితాలను తెలుసుకున్నారు. బోథ్ నియోజకవర్గంలో ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచి ఉత్కంఠ భరితంగా సాగింది. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్, బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావుల మధ్య పోటీ హోరా హోరీగా సాగింది. ఎవరిని విజయం వరిస్తోందోనని ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూశారు. చివరగా ఫలితాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ 23 వేలకు పైగా ఓట్ల అధిక్యంతో గెలుపొందడంతో ఉత్కంఠకు తెరపడింది.

ప్రతీరౌండ్‌లో అనిల్‌జాదవ్‌కు స్పష్టమైన ఆధిక్యం



జై తెలంగాణ నినాదాలు చేస్తున్న అనిల్‌జాదవ్

బోథ్: బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ మొదటి రౌండ్ నుంచి తన ఆధిక్యాన్ని కనబరిచారు. మొదటి రౌండ్ భీంపూర్ మండలం నుంచి ప్రారంభమైంది. ప్రతీ మండలంలో స్పష్టమైన మెజార్టీ రావడంతో ఆయన సులువుగా గెలుపొందారు. సిరికొండ మండలంలో మెజార్టీ స్వల్పంగా వచ్చినా భారీ మెజార్టీతో గెలుపొందారు.

మండలాల వారీగా ఓట్ల వివరాలు..

మండలం	పోలైన ఓట్లు	అనిల్‌జాదవ్	సోయం బాపూరావ్	ఆడె గజేందర్	(ఇతరులు+నోటా)
బోథ్	29717	12554	10024	5408	1731
బజార్‌హత్నూర్	18351	7276	6610	2791	1674
భీంపూర్	15622	6141	4013	4520	948
గుడిహత్నూర్	20144	9406	7457	2167	1114
ఇచ్చోడ	27798	13523	8609	4048	1618
నేరడిగొండ	19366	9816	5238	3508	804
సిరికొండ	6020	2255	2780	605	380
తలమడుగు	23813	9995	5905	6459	1454
తాంసి	11566	5331	2638	2920	677
పోస్టల్ బ్యాలెట్	1640	495	718	371	56
మొత్తం	174037	76792	53992	32797	10456

శ్రీకాంతాచారి ఉద్యమానికి దారి చూపాడు



నివాళులర్పిస్తున్న రచయితలు

ఆదిలాబాద్: తెలంగాణ మలిదశ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి ఉద్యమానికి దారి చూపాడని తెలంగాణ రచయితల వేదిక సభ్యులు బాలసాని నారాయణ గౌడ్ అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతచారి 14వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాంతాచారి త్యాగం చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక సభ్యులు అల్లూరి భూమన్న, బ్రహ్మ శ్రీనివాస్, లింగయ్య, క్రాంతి కుమార్, సత్యనారాయణ, దేవిదాస్, రమేశ్, శశికాంత్, వరప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



అయ్యప్పకు అభిషేకం చేస్తున్న గురు స్వామి జక్కని గజేందర్

కుంటాల: మండలంలోని కల్లూర్ వాసవి కళాశాలలో ఆదివారం కనుల పండువగా అయ్యప్ప మహా పడిపూజను శ్రీ గురుమంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి కుమారస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప స్వామి చిత్రపటాలకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం దీక్షాపరులు భజన గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు జక్కని గజేందర్, మంత్రి సాయినాథ్, కడార్ల హరిప్రసాద్, సిర్కూర్ రాజేశ్వర్, రాజేందర్‌రెడ్డి, నటరాజ్, కళాశాల చైర్మన్లు లోలం శ్యాంసుందర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ గట్టుపల్లి శ్రీనివాస్, సాయిలు, డైరెక్టర్ జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించేదెప్పుడో?

- రూ.4కోట్లతో బేల–గూడ బీటీరోడ్డు పనులు పూర్తి
- గూడ శివారులోని వాగుపై నిర్మించని వంతెన
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



గూడ శివారులోని వాగు వద్ద మట్టి రోడ్డు

బేల: బేల– గూడ అనుసంధాన బీటీరోడ్డు మార్గంలో గూడ శివారులోని వాగుపై వంతెన నిర్మాణం చేపట్టక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.4కోట్ల వ్యయంతో రోడ్డు పనులు చేపట్టడగా.. వంతెన నిర్మించ లేదు. దీంతో పాటు ఈవాగుపై అటు ఇటుగా సగం కిలో మీటరు వరకు బీటీ రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. మూడేళ్లుగా వంతెన నిర్మాణం, రోడ్డు పనులు పూర్తికాలేదు. ఈ పనులు పూర్తయితే గూడ, కాంఘర్‌పూర్, మణియార్‌పూర్ గ్రామాలకు మండల కేంద్రానికి వెళ్లేందుకు దూర, భారం తగ్గుతుందని ప్రజలు అంటున్నారు.

రూ.4 కోట్లతో పనులు ఇలా..

మండల కేంద్రం నుంచి (సాంగిడి రింగ్ రోడ్డు మార్గంలో) గూడ గ్రామం 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈరోడ్డు అధ్వానంగా మారడంతో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక చొరవ తీసుకొని ఐదున్నరేళ్ల క్రితం మండలకేంద్రం నుంచి గూడ గ్రామానికి 4.2 కిలోమీటర్లు అనుసంధాన బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4కోట్లు మంజూరు చేయించారు. ఇందులో భాగంగా మండల కేంద్రం శివారులో మహంకాళి ఆలయం ఎదురుగా ఉన్న వాగు నీటి ఉధృతిని నిలువరించేందుకు వాగుపై నాన్ రిటర్నింగ్ వాల్‌తో పాటు మార్గ మధ్యన 7 కల్వర్టులు, ఒక వంతెన, బీటీ రోడ్డు పనులు చేపట్టారు. ఈ పనులు మూడేళ్ల క్రితం పూర్తయ్యాయి.

వాగుపై నిర్మించని వంతెన..

గూడ గ్రామ శివారులోని వాగుపై వంతెన నిర్మించ లేదు. ఇక్కడ వాగు చాలా విస్తీర్ణంగా ఉండడంతో వంతెన నిర్మాణానికి నిధులు సరిపోకపోవడంతో పనులు చేపట్టలేదని పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. రెండున్నర ఏళ్ల క్రితమే అధికారులు వంతెన నిర్మాణం కోసం అదనంగా నిధులు రూ.3 కోట్లు మంజూరికి ప్రతిపాదనలు పంపారు. కానీ ఇప్పటిదాకా ఎటువంటి నిధులు మంజూరూ కాలేదు. దీంతో వంతెన నిర్మాణం నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులు

బీఆర్ఎస్ విజయోత్సవ ర్యాలీ



నేరడిగొండ: అనిల్ జాదవ్ ఇంటి ఎదుట నృత్యం చేస్తున్న కార్యకర్తలు

బోథ్: బోథ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపొందడంతో బీఆర్ఎస్ హర్షం వ్యక్తం చేశారు. సొనాల గ్రామంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. అనిల్ జాదవ్ నాయకత్వంలో బోథ్ నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు.

తాంసి: బోథ్ ఎమ్మెల్యేగా గెలుపొందిన అనిల్ జాదవ్‌కు మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఓట్ల లెక్కింపు అనంతరం బయటకు వచ్చిన అనిల్ జాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో తాంసి జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, అరుణ్, లింగారెడ్డి, కృష్ణ, రజనీకాంత్ రెడ్డి, రమణ, ఆనంద్, రఘు పాల్గొన్నారు.

తలమడుగు: తలమడుగు మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుతూ.. టపాసులు కాల్చారు. బీఆర్ఎస్ నాయకులు పిడుగు సంజీవరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ గెలుపు కోసం కృషి చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేశ్, సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, పిడుగు అభిరామ్‌రెడ్డి, వెంకన్న, భీమన్న, ఎలుగు ఆనంద్, శ్రీకాంత్, రవికాంత్ యాదవ్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ విజయం సాధించడంతో మండలవాసులు సంబురాలు జరుపుకున్నారు. కౌంటింగ్ కేంద్రం నుంచి ఎమ్మెల్యేగా ధృవపత్రం పొంది వస్తున్నారని తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చారు. అనిల్‌జాదవ్ శివాలయానికి చేరుకొని శివుడిని దర్శించుకొని తిరిగి ఇచ్చోడకు ప్రయాణమయ్యారు. ఇచ్చోడలో బైపాస్ రోడ్డు నుంచే విజయోత్సవ ర్యాలీ ప్రారంభించారు. వేలాదిగా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా అనిల్‌జాదవ్ గెలుపొందడంతో మండలంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కౌంటింగ్ కేంద్రం వద్దకు పలు గ్రామాల ప్రజలు వచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంతో పాటు వడూర్, కుమారి, వాంకిడి, రాజుర, లింగట్ల, కొర్టికల్, బుగ్గారం(బి), కుంటాల, తర్నం, తేజాపూర్ గ్రామాల్లో టపాసులు పేల్చారు. కార్యక్రమంలో రాథోడ్ సజన్, పెంట వెంకట రమణ, ఏలేటి రవీందర్ రెడ్డి, గాదె శంకర్, అంబేకర్ పండరి, సాబ్లే నానక్ సింగ్, సాబ్లే ప్రతాప్‌సింగ్, అనిల్ యాదవ్, ఒడిగం రాజు పాల్గొన్నారు.



తాంసి: శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



తలమడుగు: సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



గుడిహత్నూర్: విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న అనిల్‌జాదవ్



బోథ్: మాట్లాడుతున్న నాయకులు

బీజేపీ నాయకుల సంబురాలు



సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

బేల: ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ గెలుపుపొందడంతో మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆదివారం బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. అనంతరం టపాసులు పేల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, తాక్రే మురళీధర్, బోనిగిరివార్ గణేష్, రామెల్లి మోరేశ్వర్, తాక్రే సందీప్, బొడకుంటి రాకేశ్, రాపెల్లి శివకుమార్, ధర్నే జీవన్, పోత్రాజ్ నవీన్, బర్కాడే రాము, తదితరులు పాల్గొన్నారు.